సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికివచ్చి సరదాగా, కాఫీత్రాగి, అలా నాలుగు రోడ్ల జంక్షన్‌లో నలుగురితో గాస్‌కొడ్తూ త్రోవంటే పోయేవాళ్ళపై చెణుకులు విసుర్తూ నిల్చోవడం నాకున్న అలవాట్లలో ఒకటి. అదేమోస్తరుగా నాలుగురోడ్ల జంక్షన్‌లో నిలుచుని మా యూనిట్ గురించి వెయిట్ చేస్తున్నాను. ఇంతలో నా ప్రక్కనుంచి పెద్ద రొదచేస్తూ ఒక ఊరేగింపు బయలుదేరింది. దాన్నే నేను పరిశీలనగా చూస్తున్నాను. ముందు నలుగురు చిన్న కుర్రాళ్ళు నాలుగు తడకల పయిన అంటించిన పోస్టర్లు పెట్టుకొని తిరుగుతున్నారు.

"రేపే విడుదల... బ్రహ్మాండమయిన సర్కస్ కనీవినీ ఎరుగని ఆడని జతువుల ఫీట్స్‌తో ఇంతకు క్రితం మీరు చూడని అద్భుతమయిన ప్రదర్శనతో స్టేడియం గ్రౌండ్సులో ప్రారంభం" అని బాకాపట్టుకొని అరుస్తున్నాడు.

ఆ బాకా పట్టుకున్న అతను దూరాన వున్నా నేను పరిశీలనగా చూస్తే నాకు పరిచయమున్న వాడిలానే కనిపించాడు... కన్పించడమేమిటి... తీరా దగ్గిరకొచ్చిన తర్వాత అతనే పలకరించాడు.... "అరె.... రాంబాబూ .. నువ్వా... ఇక్కడున్నావా?" అని... ఒక్క నిమిషం తమాయించుకున్నాను....

నన్ను పూర్తిపేరు పెట్టి పిలిచినవారే తప్ప కట్ చేసి రాంబాబు అని పిలిచినవారు ఇద్దరే ఇద్దరు ... ఒకరు మా అమ్మ.... రెండోది.... రెండోది.... అవును.... రామేశం....

"ఏం.... రాంబాబూ... ఇంకా గుర్తు రాలేదా?" అని అడిగాడు. అడుగుతూనే తన చేతిలో వున్న బాకాను ప్రక్కనున్న వాని చేతిలోపెట్టి... మీరు ముందుకు వెళ్ళండి... పదినిముషాలలో వస్తాను".... అని వాళ్ళను పంపించివేశాడు... ఊరేగింపు మమ్మల్ని దాటి మరికొంచెం ముందుకు సాగింది....


"రామేశం ....నువ్వు....ఇలా...ఆబాకా ఏమిటి....ఆ ఊరేగింపు... మాటలు తడబడ్డాయి నాకు....

"బాగుంది... నాకు ఒక ఊరేమిటి ... మా సర్కస్ కంపెనీ ఎక్కడ ఉంటే అక్కడే కేంపు ... తెనాలిలో రెండు రోజుల క్రితం వున్నాము. అక్కడ వేస్తామన్నారు. మాఆర్గనైజరు....ఇక్కడ ఓ... పదిహేను రోజులు కంట్రాక్టు .... కలెక్షన్స్‌బాగావుంటే ఇంకా వుంటాము... అది సరే కాని....నువ్వేం చేస్తున్నావు? చాలా రోజుల తర్వాత కలిశాం .... ఎక్కడ... పదిహేను సంవత్సరాల క్రితం నువ్వు మీ మేనమామ గారింటికి చదువుకని మీ అమ్మ గారితో మన వూరు విడిచి పెట్టిన తరువాత.... మరి కలియలేదు...." నాన్‌స్టాప్‌గా తనే మాటాడుతున్నాడు... అసలు ఇంత మాటకారి ఎలా అయ్యాడో.... సాధ్యమయినంత వరకు గుర్తు నేసుకొని... ఇతగాడే... ఆ రామేశం అని నిర్ధారణ చేసుకొని.... "ఆ.... అదే... ఇక్కడ ఏదో ఉద్యోగ రీత్యా వున్నామనుకో... దిగువ వీధిలో మకాం.... మా అమ్మ.... ఆవిడ కూడా ఇక్కడే వున్నారనుకో.... చిన్న బాబు కూడా....అది సరే ... సర్కస్‌లో నీకేం పని.... ఏదయినా మేనేజరులాటిదా ...."

"అదేం కాదు...ఎక్కడా గతిలేక.... ఈ సర్కస్ కంపెనీలో జాయినయ్యానులే మేనేజరుకాదు ... ఓ ఆర్టిస్టుని...ఇప్పటికే లేటయింది...ఇందా ఫామిలీ పాసు. రేపు తప్పక ఫస్టుషోకిరా... నా ప్రదర్శనచూస్తే నీవే ఆశ్చర్యపడతావు...." అని జేబులోనుంచి ఓపసుపు రంగుగల కార్డునాచేతిలో పెట్టిపోయాడు.... ఆ కార్డును ఓమారు.... రామేశం వెళ్ళిన వైపు ఓమారు... మార్చి మార్చి చూడసాగాను ..

# మంటలు

ఎమ్.ఎస్. భగవాన్




ఇంతలోనే మా యూనిట్ వచ్చి నన్ను డిస్టర్బ్ చేశారు..అప్పటికి రామేశం గురించి ఆలోచనలు కట్టిపెట్టి .. మా వాళ్ళతో బాతాఖానీ దిగాను....

* * *

తిరిగి తిరిగి రాత్రి ఎనిమిదింటికి ఇంటికి వచ్చి.... కాస్త భోంచేసి.... ప్రక్క మీదకి చేరి....తీరుబడిగా.... రామేశం గురించి నెమరువేయడం ప్రారంభించాను.. పదిహేను సంవత్సరాల క్రితం.... మా ఊరిలో మా ఇంటిప్రక్కనే రామేశం వాళ్ళు ఉండేవాళ్ళు.... రామేశం వాళ్ళు ఎక్కడనుంచి వచ్చారో నాకు సరిగ్గా తెలియదు... కాని వచ్చిన దగ్గిరనుంచే మా ప్రక్కనే వున్నారు... రామేశం... వాళ్ళమ్మగారు.... వాళ్ళ నాన్నగారి సంగతీ నాకంతగా తెలీదు. రామేశం మొదటినుంచి భయస్తుడు. పిరికివాడు... మా ఇంటికి కూడా తరచు రావటానికి భయపడేవాడు. ముఖ్యంగా అతనికి మంటలంటే విపరీతమయిన భయం...అతన్ని ఈ విషయంలోనే మేమంతా ఎక్కువగా ఎగతాళి చేసే వాళ్ళము....దిపావళి నాడెప్పుడూ....బయటకి రాక లోపలి గదిలో ముసుగేసుకొని... పడుకున్న ... రామేశాన్ని చూస్తే నాకు

బిలే సరదా అనిపించేది....అగ్గిపుల్ల వెలిగించిన మంట అన్నా ఎక్కువ భయపడేవాడు...అతని తత్వమే అంత.... భోగి పండుగనాడు తలకి స్నానము చేసిన తరువాత ఆ చలిలో మేమంతా భోగిమంట దగ్గరకు వెళ్ళాలని...రామేశాన్ని కూడా వస్తావా...అని పిలవాలని వెళ్తే..వాళ్ళమ్మ.. రామేశం రాడు .... బాబూ .. వాడికి ఆ మంటలను చూస్తే గుండెదడ .... అని వీధిలో నుంచే పంపించివేసేవారు .... నేను ఎన్నోసార్లు రామేశాన్ని దగ్గరగా పిలిచి ఆ భయాన్ని పోగొడదామనుకున్నా గాని.... ఆ విషయం గురించి ప్రశ్నలు ప్రారంభించగానే ... దెబ్బతిన్నవాడిలా చూసి... "రాంబాబూ .... మంటలు ... మంటలు...." అనేవాడు. ఒకసారి మాత్రం నిజం రాబట్టాను .. వణుకుతున్న గొంతుతో "మంటల్ని చూసినప్పుడల్లా నా చిన్నప్పుడు నన్ను రక్షించడానికి మంటల్లోకి దూకి, మసి అయిపోయిన మా నాన్న గుర్తొస్తారు..." ఆపయిన అతని మాటలు వినిపించేవి కావు... ఊరిలో ఎవరివయినా ఇళ్ళు కాలిపోతే మా కుర్రకారంతా .. ఎగురుతూ ... సరదాగా తిరుగుతుండేవాళ్ళము.... మాకు ఊహ తెలియని వయస్సది.... కొంతమంది ఇళ్ళు తగలబడిపోతుంటే అది మాకు వినోదంలా వుండేది.... ఓ రోజు మా స్కూలునుంచి అంతా కలిసి వస్తూంటే మా దగ్గరలోనే వున్న మాలవాడ అంటుకొంది.... మేమంతా గెంతుతూ చుట్టూ చేరి మంటలను వింతగా చూస్తున్నాము. కాని నేను ప్రక్కకి తిరిగి రామేశం గురించి చూస్తే ఆ దరిదాపుల్లో ఎక్కడా లేడు.... దూరంగా ఏకబిగిన వెనక్కి తిరిగి చూడకుండా పరిగెడుతూన్న రామేశం కన్పించాడు. అలా రామేశం వింత ప్రవర్తన గురించి ఆలోచిస్తూ పడుకున్న నాకు ఎప్పుడు నిద్రపట్టిందో తెలీలేదు

* *

మరునాడు ఆఫీసు పని ముగించుకొని వచ్చి త్వరత్వరగా ఇంటి వాళ్ళతో కలిసి ... ఇంటికి .... తాళం వేసి ... ఓసారి రామేశం ఇచ్చిన ఫ్యామిలీ పాస్ నా జేబులో వుందో లేదో చూసుకున్నాను.... సర్కస్ గ్రౌండ్సుకు బయలుదేరి వచ్చేసరికి.


## ప్రతిభా నికేతన్

బాల బాలికల వసతి విద్యాలయము

(ఎస్. ఆర్. ఆర్. & సి. వి. ఆర్ కాలేజీ ప్రక్కరోడ్డు)

మాచవరం, — విజయవాడ 4

**పునః ప్రారంభం : జూన్ 11వ తేది.**

* శిక్షణ : నర్సరీ నుండి మెట్రిక్ వరకు.
* నర్సరీనుండి 6వ తరగతి వరకు మాత్రమే క్రొత్త విద్యార్థులకు ప్రవేశము కలదు.
* జూన్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు అప్లికేషనులు ఇవ్వబడును.
* 6, 7, 8 తేదీలలో ప్రవేశ పరీక్షలు నిర్వహించబడును.
* దూర ప్రాంతముల నుండి వచ్చువారికి అనుకూల సదుపాయములుగల హాస్టలు వసతి కలదు. హాస్టలునందు పరిమిత సంఖ్యలోనే విద్యార్థులు చేర్చుకొనబడుదురు. ఇతర వివరములు విద్యాలయ నియమావళి (ప్రాస్పెక్టస్) ద్వారా క్రిందివారినుండి పొందవచ్చును.

ఎ. బి. కె. ప్రసాద్ ప్రిన్సిపాల్ & కరస్పాండెంట్

అక్కడ కూడా బుకింగు క్లోజయినట్లుంది. .... లోపల షో ప్రారంభమవుతోంది అనడానికి తార్కాణంగా బెల్ మ్రోగింది....ఆదరా బాదరాగా మా ఫ్యామిలీతోసహా సీటులో కూర్చొని సర్కస్ ఎరీనావైపు దృష్టి సారించాను... ఎవరో ఇద్దరు బఫూనులు అప్పుడే తమ నాటకాన్ని ప్రారంభించారు....ఒకదాని తరువాత ఒకటి ఏవో అయిటమ్స్ వస్తున్నాయి. మధ్యన వస్తున్న ఏనుగులు.... వగయిరా అడవి జంతువులనుచూసి.... మా చిన్నవాడు సీట్లోంచి లేచి గెంతసాగాడు....నా కళ్ళు మాత్రం....రామేశం ఏం చేస్తున్నాడు .... ...ఎప్పుడు వస్తాడు....అని ఆలోచిస్తున్నాను. రామేశం చెప్పాడు కదా .... తాను కూడా ఇందులో ఆర్టిస్టునని... షో సగమైనట్లుంది. ఇంతలో ఎవరో సర్కస్ బాయ్ వచ్చి "రామేశంగారు పంపించారు.... సార్" అని నాలుగు డ్రింక్సు ఇచ్చాడు. "రామేశం ఏడీ...." అని అడిగాను నేను.

"తర్వాత ఫీటు వారిదే సార్....తయారవుతున్నారు... అని ఖాళీబాటిల్స్ తీసుకుని వెళ్ళాడు....ఇంతలో మైకులో ప్రకటన వెలువడింది.

"మీరు ఇంతవరకు ఎదురుచూస్తున్న క్రొత్త ఫీట్ .... ప్రదర్శించువారు.... మిస్టర్.. రామేశం...." ఇంకా ప్రకటన పూర్తికాలేదు... రామేశం ఫుల్ డ్రెస్సులో వచ్చి లేడరు పట్టుకుని పైకి వెళ్ళిపోయాడు... అక్కడనుండి నన్ను చూసి చిరునవ్వు నవ్వినట్టుంది.... అది బహుశా నా అనుమానం మాత్రమే... అక్కడ నల్లని ముసుగు ధరించి ఒంటినిండా కిరసనాయిల్ పోసుకొని అగ్గిపుల్లతో అంటించుకున్నాడు. క్రిందన అంటే 30 అడుగుల నేలమీద చిన్న కొలను లాటిది త్రవ్వి వుంచారు, నిండా నీరు కూడా వుంది. నేను నా గుండె చేత పట్టుకొని చూస్తున్నాను.... మంటలు తారస్థాయిని అందుకున్నాయి. అంతే.... అంత ఎత్తు నుండి దభీమని.... రామేశం కొలనులోనికి గెంతాడు.... ఆపయిన మరి నేను చూడలేక పోయాను.

విపరీతమయిన చప్పట్లు పడ్డాయి.

* * *

పదిహేను రోజులనుకున్న సర్కస్ నెలరోజులు వేశారు. రామేశం ఫీటు మూలాన...కాని ఆ తరువాత నేను రామేశాన్ని కలియలేదు సరికదా...కలిసే ప్రయత్నంకూడ చేయలేదు.....రామేశాన్ని వదిలిన మంటలంటే భయం నన్ను పట్టుకొంది...ఎక్కడ ఏ మంట చూసినా నాకు బ్రతుకుతెరువుకు...అందులో కాలిపోతున్న రామేశం కన్పించేవాడు. ★

## శాస్త్రీయపాకం

బ్రతుకుపైని విసుగెత్తినవాడు_విషము
త్రాగి ఆత్మహత్యకు బూనదలచనేల ?
పాకశాస్త్రము పఠియించి వంట చేయు
వనిత చేయు వంటకమును తినిన చాలు !

— దాశరథి